క్లుప్తంగా

జింకు లోపాన్ని నివారించండి
ఏవో అహ్మద్

అమరావతి: మండలంలోని వివిధ గ్రామాలలో గతేడాది కూడా పత్తి పైరులో జింకు లోపం ఉందని రైతులు దీనిని నివారించక పోతే తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని మండల వ్యవసాయాధికారి అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జింకు లోపం వల్ల మొక్కల ఈనెలు ఆకుపచ్చగా ఉండి, ఈనెల మధ్యభాగం పసుపు రంగుకు మారుతుందన్నారు. దీనివల్ల ఆకులు బలంగా ఉండక రాలిపోతాయన్నారు. దీని నివారణకు ఎకరానికి 20 కిలోల జింకు సల్ఫేట్ దుక్కిలో వేయాలని, పైరుపై ధాతులోప లక్షణాలు కనబడగానే 2గ్రా. జింకు సల్ఫేట్‌ను ఒక లీటరు నీటిలో కలిపి 2-3 సార్లు 4-5 రోజులకు ఒకసారి పిచికారీ చేయాలన్నారు. పత్తి విత్తనాలు నాటిన 25 నుంచి 30 రోజులలోపు మొదటి దఫా 45 కిలోల భాస్వరం, 30 కిలోల పొటాష్ ఎరువులు వేయాలన్నారు.

హెచ్ఐవీపై అవగాహన



సత్తెనపల్లి: హెచ్ఐవీ పట్ల అప్రమత్తంగా ఉండాలని సత్తెనపల్లి ఐసీటీసీ కౌన్సిలర్ రఘునాథ్ అన్నారు. ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశానుసారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో భాగమైన డిస్ట్రిక్ట్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్ఐవీ, ఎయిడ్స్ సొసైటీ సహకారంతో పట్టణంలోని సబ్ జైల్లో ఉన్న ఖైదీలకు సోమవారం అవగాహన కల్పించారు. హెచ్ఐవీ, టీబీ, హెపటైటిస్, సిఫిలిస్ పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ టి.వెంకటరత్నం, జైలు హెడ్ వార్డు ఎస్.విశ్వేశ్వరరావు, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ జయప్రద, ల్యాబ్ టెక్నీషియన్ సుభాని, ఖైదీలు తదితరులు ఉన్నారు.

రాయితీపై వరి విత్తనాల పంపిణీ



నకరికల్లు: రాయితీపై పంపిణీ చేస్తున్న వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. రాయితీపై వరి విత్తనాలు మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక కేజీ వరి విత్తనాలు రూ.43 కాగా రూ.38కు రైతులకు ఇస్తున్నట్లు తెలిపారు. కేఎన్ఎం-1638 50 క్వింటాళ్లు, బీపీటీ-5204 10 క్వింటాళ్లు పంపిణీ చేస్తామని, సుమారు 25 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేశామన్నారు. కావలసిన రైతులు సంబంధిత పత్రాలతో రైతు సేవ కేంద్రంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కె.దిలీప్‌కుమార్, వీఏఏలు ప్రియదర్శిని, సునీలకుమారి, గ్రామ పెద్దలు బత్తుల జానకిరామయ్య, కరాలపాటి వలి, బత్తుల చిన అప్పారావు, డాక్టర్ చింతపల్లి ఫకీర్ అహ్మద్, రైతులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధిలో కో ఆపరేటివ్ సొసైటీల పాత్ర కీలకం
ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



సత్తెనపల్లి: గ్రామీణ అభివృద్ధిలో కో ఆపరేటివ్ సొసైటీల పాత్ర ఎంతో కీలకమని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లి మండలం పాకాలపాడు గ్రామంలో పాకాలపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా కొణికినేని సత్యనారాయణ, మెంబర్లుగా పేరం హరిబాబు, అన్నదాసు వెంకట్రామయ్యల ప్రమాణ స్వీకార మహోత్సవంలో సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కొత్తగా నియమితులైన సొసైటీ ప్రతినిధులు సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సొసైటీలో బకాయిలు త్వరగా చెల్లించేలా చూసి అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దరువూరి నాగేశ్వరరావు, నాయకులు యెల్లినేడి రామస్వామి, కోమటినేని శ్రీనివాసరావు, మక్కపాటి రామచంద్రరావు, ఆళ్ల సాంబయ్య, షేక్ నన్నేసా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

నకరికల్లు: పచ్చదనంతో పాటు పర్యావరణంలో కాలుష్యం అరికట్టేందుకు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు శ్రీరామ సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు వేల్పుల కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో చెరువు కట్టపై వాకింగ్‌ట్రాక్ చుట్టూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని శ్రీరామ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షేక్ అబ్దుల్లా, వీఆర్వో లింగయ్య, ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు కొత్త సూర్యప్రకాశరావు,సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సాగు.. జాగు

భూమి పదునుకాక ఖరీఫ్ సాగు ఆలస్యం

- పచ్చిరొట్ట విత్తనాలు కూడా సాగుచేయని అన్నదాతలు
- జూలై ముగుస్తున్నా సిద్ధం కాని వరి నారుమడులు
- వరి విత్తనాల పంపిణీ కూడా ఆలస్యమే
- గతేడాది కన్నా ఈ ఏడాది ఖరీఫ్ ఆలస్యంతో రబీ సాగు ప్రశ్నార్థకం



సాగు చేయక ఖాళీగా ఉన్న పొలం

నకరికల్లు: కార్తెలన్నీ వెళ్లిపోతున్నాయి.. సమృద్ధిగా వర్షాలు పడే అవకాశాలు కన్పించడం లేదు. ఓ వైపు సాగర్ జలాశయం నుంచి సాగునీరు వస్తుందన్న ఆశలు చిగురిస్తున్నా భూమి పదునయ్యే వానలు పడక ఈ ఏడాది ఖరీఫ్ సాగు ఆలస్యమవుతుంది. ఏటా జూన్‌లో వేయాల్సిన జీలుగ, జనుము ఊసే లేదు. జూలైలో సాగు చేయాల్సిన నారుమళ్లు జూలై ముగుస్తున్నా సాగు చేసే పరిస్థితి లేదు. దీంతో ఏటా ఆగస్టు మొదటి వారంలో పడాల్సిన వరి నాట్లు ఆలస్యమయ్యే పరిస్థితి దాపురించింది. ఏటా రెండు పంటలు పండించే భూములు ఈ ఏడాది ఖరీఫ్ ఆలస్యమవడంతో ఖాళీగా పడి ఉన్నాయి.

17 వేల ఎకరాల మాగాణి

మండలంలో 17 వేల ఎకరాల్లో వరి సాగు చేసే మాగాణి భూములు ఉన్నాయి. ఏటా మే, జూన్ నెలల్లో జీలుగ, జనుము లాంటి పచ్చిరొట్ట ఎరువులు సాగు చేసి జూలై ప్రారంభంలో వరి నారు చల్లుకుంటారు. 40 రోజుల తరువాత ఆగస్టు మొదటి వారం నుంచి ఖరీఫ్ వరినాట్లు వేస్తారు. డిసెంబర్ నుంచి రబీ వరి సాగు చేస్తారు. కానీ ఏ ఏడాది సకాలంలో వర్షాలు లేక జీలుగ, జనుము లాంటి పచ్చిరొట్ట ఎరువులు సాగు చేయలేదు. జూలై ముగుస్తున్నా ఇప్పటివరకు నారుమడులు వేయలేదు. దీంతో ప్రస్తుతం పడుతున్న వర్షాలకు మరోవారం తరువాత నారుమడులు వేసే యోచన చేసినప్పటికీ ఖరీఫ్ ఆలస్యమయ్యే ప్రభావం రబీపై కూడా పడుతుంది. దీంతో ఈ ఏడాది ఒక్క పంటకే పరిమితమవుతుందా..? అన్న సందిగ్ధం అన్నదాతల్లో ఎదురవుతుంది.

పంపిణీ కాని వరి విత్తనాలు

గత ప్రభుత్వ హయాంలో ఏటా జూన్‌లోనే వరి విత్తనాలను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాయితీపై రైతులకు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఏడాది వరి విత్తనాల పంపిణీ చేపట్టలేదు. ఇకపై విత్తనాలు పంపిణీ చేసినా అదను దాటిపోవడంతో ఒక్క పంటకే పరిమితమయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి.

వరి నారుకు పెరగనున్న డిమాండ్

ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడక సాగునీటిపై ఆధారపడిన పొలాల్లో వరి నారు వేసేందుకు అన్నదాతలు ధైర్యం చూపలేదు. మరోవైపు అదను దాటిపోతుందన్న సందిగ్ధంలో మునిగిపోయారు. ప్రస్తుతం సాగర్ నుంచి సాగునీటిని విడుదల చేస్తారన్న ఆశలు చిగురిస్తున్న నేపథ్యంలో సమయం మించిపోకుండా వరి సాగు చేయాలకున్న రైతులు బోర్లు, బావుల కింద సాగు చేసిన నారు కొనుగోలు చేసి ఖరీఫ్ సాగుకు యోచిస్తున్నారు. దీంతో బోర్ల కింద సాగు చేసిన వరి నారుకు విపరీతమైన డిమాండ్ పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి.

త్వరలో విత్తనాలు పంపిణీ చేస్తాం



ఖరీఫ్‌లో వరివిత్తనాల కోసం నివేదిక పంపాం. కిలోకు రూ.5 రాయితీ కల్పిస్తూ మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో సోమవారం 25 క్వింటాళ్ల వరి విత్తనాలు పంపిణీ చేశాం. డిమాండ్ మేరకు అవసరమైన వరి విత్తనాలు రాగానే రైతులకు పంపిణీ చేస్తాం. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు అధీకృత డీలర్ల వద్దే కొనుగోలు చేసి తప్పనిసరిగా రసీదులు పొందాలి.

– కె.దేవదాసు, మండల వ్యవసాయాధికారి, నకరికల్లు

మున్సిపల్ కార్మికుల వినూత్న నిరసన



సత్తెనపల్లి: తమ న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె సత్తెనపల్లిలో 9వ రోజుకు చేరింది. సోమవారం మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు వినూత్నంగా భిక్షాటన చేసి నిరసన తెలిపారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీఓ నెంబర్ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, రిటైర్మెంట్, అనారోగ్యంతో ఉన్న, మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాద మరణానికి ఎక్స్‌గ్రేషియా రూ.7 లక్షలకు, మట్టి ఖర్చులు రూ.20 వేలకు పెంచాలన్నారు. 10 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసిన కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు, సీఐటీయూ నాయకులు ఉన్నారు.

పత్తి సాగు చేసే రైతులు పంటకు బీమా చేసుకోవాలి

ఏవో బి.సుబ్బారెడ్డి



సత్తెనపల్లి: మండలంలో పత్తి పంటను సాగు చేసే రైతులు పంట బీమా కొరకు ఎకరాకు ప్రీమియం రూ.1,900 చెల్లించాలని సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి బి.సుబ్బారెడ్డి సూచించారు. పట్టణంలోని తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఏఐసీ) ద్వారా కాలానుగుణంగా వాతావరణంలో వచ్చే మార్పులతో పంటకు నష్టం వాటిల్లితే రైతులను ఆదుకొనుటకు పునర్వ్యవస్థీకరింప బడిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం ఖరీఫ్-2025 నుంచి అమలు చేస్తుందన్నారు. పంట నష్టం కలిగినట్లయితే బీమా మొత్తం రూ.38 వేలు పొందవచ్చన్నారు. వ్యవసాయ రుణం పొందిన రైతులు బ్యాంకు శాఖ ద్వారా, వ్యవసాయ రుణం పొందని రైతులు దగ్గరలోని కామన్ సర్వీస్ సెంటర్, మీ సేవా సెంటర్, రైతు సేవా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించి పంటల బీమా చేసుకోవాలన్నారు. పంటల బీమా పథకం గడువు ఈ నెల 31తో ముగుస్తుందన్నారు. మండలంలో పత్తి సాగు చేసిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రీ సర్వే ప్రక్రియపై సమీక్ష



గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు గ్రామ సచివాలయంలో భూముల రీ సర్వే ప్రక్రియపై డిప్యూటీ తహసీల్దార్ బాల వెంకటేష్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు జరిగిన రీసర్వే ప్రక్రియ, అనంతరం జరుగుతున్న రికార్డుల వెరిఫికేషన్‌ను తనిఖీ చేశారు. గ్రౌండ్‌ట్రూతింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం రైతుల వద్ద సంబంధిత భూములకు సంబంధించి రికార్డులు పరిశీలించి ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. మండల సర్వేయర్ రాజు, వీఆర్వో బి.దాసు, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్‌లు పంపిణీ



రాజుపాలెం: క్షయ వ్యాధిగ్రస్తులు సరైన పౌష్టికాహారం తీసుకోవడం వలన వ్యాధి త్వరగా తగ్గుతుందని డాక్టర్ రవితేజనాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్యూబ్ హైవేస్ ఫౌండేషన్ సహకారంతో క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్‌లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవితేజనాయక్ మాట్లాడుతూ క్షయవ్యాధి తగ్గే వరకు పౌష్టికాహార కిట్‌లను అందిస్తామని తెలిపారు. మండలంలో ఉన్న 20 మంది వ్యాధిగ్రస్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, క్రోసూరు టీబీ యూనిట్ పర్యవేక్షకులు సౌజన్య, ఇబ్రహీం, రాజారమేష్, హెల్త్ విజిటర్ ఉషారాణి, ఆరోగ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

నేడు 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' సమావేశం

ముప్పాళ్ళ: బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ, రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో గుర్తుకు తెస్తూ మండల స్థాయి సమావేశం ఈ నెల 22వ తేదీన జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. చాగంటివారిపాలెం గ్రామంలోని సాయిబాబా ఆలయ ఆవరణలో సాయంత్రం 5 గంటలకు జరిగే కార్యక్రమంలో సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ రెడ్డి పాల్గొంటారని, మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆహార సలహా సంఘాలను నియమించాలి



తహసీల్దార్ డానియేల్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

అమరావతి: మండలంలో ఆహార సలహా సంఘాలను నియమించి క్రమం తప్పకుండా సమావేశాలు ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్‌కు సీపీఎం ఆధ్వర్యంలో మండల స్థాయిలో ఆహార సలహా సంఘాలు ఏర్పాటు చేయాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా పంపిణీ వ్యవస్థ పటిష్టం కోసం రేషన్ కార్డుదారులకు నిత్యావసర వస్తువులు సక్రమంగా అందించేందుకు, పర్యవేక్షణ కోసం అన్ని రాజకీయ పార్టీలు స్వచ్ఛంద సంస్థలు, డీలర్లు, అధికారులతో గతంలో ఆహార సలహా సంఘ సమావేశాలు నిర్వహించేవారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఏడాది దాటినా ఆహార సలహా సంఘ సమావేశం ఏర్పాటు చేయలేదన్నారు. రేషన్ లబ్ధిదారుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లటానికి ఆహార సలహా సంఘాలు అవసరమన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ డానియేల్ మాట్లాడుతూ త్వరలో అహార సలహా సంఘ సమావేశం ఏర్పాటు చేస్తామన్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ రూరల్ కార్యదర్శి ఎస్కే మోహద్దీన్ వలి, నందు వెంకటేశ్వరరావు, సీఐటీయూ నాయకులు ఎస్కే రఫీ, లక్ష్మిశెట్టి ఏడుకొండలు, శృంగారపాటి రాజకుమార్, పాములు, ఎస్కే నాగుల మీరా, పౌలు తదితరులు పాల్గొన్నారు.

● ఓ గుంత... ప్రయాణానికి చింత



ఆర్టీసీ బస్టాండ్ ఎదుట వర్షపు నీటితో నిండిన గుంత

కొండమోడు-పేరేచర్ల ప్రధాన రహదారిలో పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ లోపలికి వెళ్లే ప్రాంతంలో గుంతతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు పడడంతో నీరు చేరి రోజురోజుకీ విస్తరిస్తుంది. రాత్రి వేళల్లో బస్టాండ్ నుంచి ఈ మార్గంలో ప్రయాణాలు సాగించే వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతను పరిశీలించి బాగు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– సత్తెనపల్లి

రోడ్లపై వర్షపు నీరు.. పొంగి పొర్లిన డ్రైనేజీలు



పాతూరు రోడ్డుపై నుంచి పారుతున్న డ్రైనేజీల్లోని వర్షపు నీరు



స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట పొంగి పొర్లుతున్న డ్రైనేజీ

నకరికల్లు: వర్షపునీటితో ప్రధాన డ్రైనేజీలు పొంగిపొర్లాయి. సోమవారం కురిసిన వర్షంతో స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద డ్రైనేజీ నిండిపోయి స్టేషన్ ప్రధానగేటు ఎదుట, రోడ్డుపై నీరు పారింది. పాతూరు రోడ్డులోని ప్రధాన రహదారి డ్రైనేజీ నీటితో నిండిపోయింది. రోడ్డుపై మురుగునీరు పారడంతో దుర్వాసన వెదజల్లింది. స్థానిక అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై భారీగా వర్షపు నీరు నిలిచి వాహనాల రాకపోకల సమయంలో ఆ నీరంతా సమీపంలోని దుకాణాలపై చిందిపడడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. ప్రధాన రహదారి వెంబడి డ్రైనేజీల నిర్వహణ లోపంతో వర్షం కారణంగా రోడ్లపైకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ఎస్‌టీఓ కార్యాలయంలోకి చేరిన వర్షపు నీరు



ఫైల్స్ పట్టుకప్పి వర్షపు నీటిలో ఉద్యోగులు



ఎస్‌టీఓ కార్యాలయ వరండాలో వర్షపు నీరు

సత్తెనపల్లి: పట్టణంలోని తాలూకా సెంటర్‌లో ఉప ఖజానాధికారి(ఎస్‌టీఓ) కార్యాలయం సోమవారం కురిసిన వర్షపు నీటితో నిండిపోయింది. ఎంతో కాలంగా శిథిలావస్థకు చేరినప్పటికీ కార్యాలయ భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో పాత భవనంలోనే కొనసాగుతుంది. తహసీల్దార్ కార్యాలయం పక్కన చేపట్టిన భవన నిర్మాణం పూర్తి కాలేదు. సోమవారం కురిసిన వర్షానికి వర్షపు నీరు ఎస్‌టీఓ కార్యాలయంలోకి ప్రవేశించడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విధి నిర్వహణకు ఆటంకం కలగటమే కాక అక్కడ ఉన్న ఫైల్స్‌ను తడవకుండా భద్ర పరిచేందుకు నానా అవస్థలు పడ్డారు. నీటిలోనే పూర్తిగా మగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి ఎస్‌టీఓ కార్యాలయ భవన నిర్మాణం పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

గ్రామాల్లో పడకేసిన పారిశుద్ధ్యం

- రోడ్లపై పారుతున్న మురుగు
- పట్టించుకోని పంచాయతీ సిబ్బంది



అబ్బు రాజుపాలెం కాలచక్ర రహదారిపై పారుతున్న మురుగు



అబ్బురాజుపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద పారని మురుగు

పెదకూరపాడు : మండల వ్యాప్తంగా పారిశుద్ధ్యం పడకేసింది. రహదారులపై మురుగు పారుతూ.. కాలువల్లో మురుగు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతూ ప్రజారోగ్యానికి హాని కలిగిస్తున్నాయి. పెదకూరపాడు మండలం కాశిపాడు గ్రామంలో మురుగునీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో రోడ్లపైనే మురుగు పారుతుంది. దుర్వాసన వెదజల్లుతుంది. కాలువల్లో మురుగు పేరుకు పోయింది. అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామ ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అబ్బురాజుపాలెం పంచాయతీ కార్యాలయం పక్కన పెద్ద ఎత్తున మురుగు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుంది. కాలచక్ర రహదారిపై మురుగు పారుతుంది. అధికారులు తగు చర్యలు తీసుకోకపోవడంతో పక్కనున్న ఎస్టీ కాలనీ వాసులు వ్యాధుల బారిన పడుతున్నారు. అధికారులు పారిశుద్ధ్య మెరుగుదల పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వేలల్లో కుక్కలు.. వందల్లో రికార్డులు

పట్టణంలో వీధి కుక్కలతో భయాందోళనలో ప్రజలు



జాతీయ రహదారిపై స్వైరవిహారం చేస్తున్న వీధి కుక్కలు

సత్తెనపల్లి: జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో వీధి కుక్కల సంచారంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రోజురోజుకీ కుక్కల సంతతి పెరిగిపోతుంది. వీధుల్లో గుంపులుగా తిరుగుతూ జనంపై దాడి చేస్తున్నాయి. చిన్నారులకు ప్రాణాపాయం నెలకొందని, సత్తెనపల్లి వీరాంజనేయ నగర్‌లో ఇటీవల కుక్కల దాడిలో నాలుగేళ్ల బాలుడు తీవ్ర గాయాలపాలైన నేపథ్యంలో పట్టణంలో కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసే కార్యక్రమాన్ని ఏడాదిగా చేపట్టకపోవడంతో పట్టణాల్లో వేల సంఖ్యలో వీధి కుక్కలు తిరుగుతున్నా... వందల్లో ఉన్నట్లు అధికారులు దస్త్రాల్లో చూపుతున్నారు. కుక్కకాటుకు గురైన వారు అధిక సంఖ్యలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కుక్కల దాడిలో పాడి పశువులు సైతం గాయపడుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వీధి కుక్కలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని, వాటికి సంతాన ఉత్పత్తి కలగకుండా శస్త్ర చికిత్సలు నిర్వహించాలని పుర ప్రజలు కోరుతున్నారు.

బహుళ ప్రయోజన గోదాం ప్రారంభం ఎప్పుడో..?



క్రోసూరు: మండలంలోని దొడ్లేరు గ్రామంలో రైతుల ప్రయోజనాల కొరకు క్రోసూరు వ్యవసాయ పరపతి సంఘం అనుబంధంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) నాబార్డు నిధులు రూ.40 లక్షలతో మల్టీ పర్పస్ మార్కెటింగ్ గోడౌన్ నిర్మాణం పూర్తి చేసుకుని ఏడాదిన్నర కావస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదని రైతులు అంటున్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన రైతు సంక్షేమ పథకాల్లో భాగంగా మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చొరవతో నిధులు కేటాయింప చేసి సుమారు 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోడౌన్ త్వరితగతిన పూర్తి చేశారు. దొడ్లేరు చుట్టపక్కల గ్రామాల రైతుల అవసరాలకు గోడౌన్ అందుబాటులోకి తెచ్చారు. దీనిపై క్రోసూరు పీఏసీఎస్ కార్యదర్శి నాగేశ్వరరావును వివరణ కోరగా గోడౌన్‌ను తమకు అప్పగించలేదని, డీసీసీబీ నుంచి అనుమతి రాలేదని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు గోడౌన్ ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.